ఇంకా వరద నీటిలోనే!

ముంపు ప్రాంతాల్లో పొంగుతున్న డ్రైనేజీలు.. బాటసారుల అవస్థలు.. అందని సహాయక చర్యలు..

హయత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి మునిగిన హయత్‌నగర్‌లోని బంజారాకాలనీ, రంగనాయకులగుట్ట, పద్మావతి కాలనీలు నేటికి వరద నీటిలోనే ఉన్నాయి. మునగనూర్ కల్వర్టు నుంచి వచ్చే వరద తగ్గింది అనుకునే లోపు మళ్లీ ముంపు ప్రాంతాలకు మరో ముప్పు ఏర్పడింది. బాతుల చెరువు నిండి అలుగు పోస్తుండడంతో నీరు బంజారాకాలనీ, అంబేడ్కర్‌నగర్, రంగనాయకుల గుట్ట లోతట్టు కాలనీలకు వస్తోంది. దీంతో మళ్లీ వరద నీరు ఇండ్లలోకి చేరుతోంది. వరద దాటికి సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకోవడానికి అధికారులు ముందుకురాకపోవడం పట్ల బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జోనల్ కమిషనర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వచ్చి పోయారే కానీ తమకు ఎలాంటి సహాయమూ అందివ్వలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటిలో అన్ని వస్తువులు తడిసి పోయి నిరాశ్రయులం అయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణ సహాయం కింద పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బియ్యం, వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, పుస్తకాలు అన్ని తడిపోయాయని బాధితులు పేర్కొన్నారు.



బంజారాకాలనీలో ఇంట్లోకి పాదం లోతు నీరు



వరద నీటిలో ఉన్న బంజారాకాలనీ..

వదలని వరద..

రంగనాయకులగుట్ట లోతట్టు కాలనీ, బంజారాకాలనీలు నేటికీ వరద గుప్పిట్లోనే ఉన్నాయి. నేటికీ రోడ్ల వెంట వరద పారుతునే ఉంది. వరద ఇండ్లలోకి వస్తూనే ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాతుల చెరువు అలుగు పోస్తుండడంతో వరద చెరువు నీరు తిరుమలకాలనీ, కట్ట మైసమ్మ కాలనీ మీదుగా బంజారాకాలనీకి చేరుకుంటుంది. దీంతో దాదాపు పది కాలనీలు బురదమయంగా మారాయి.

సూర్యవంశీ కాలనీలో..

మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు సూర్యవంశీ కాలనీ దిగువ భాగంలో హయత్‌నగర్ బంజారా కాలనీ నుంచి వస్తున్న వరద నీరు ప్రవాహిస్తోంది. బంజారా కాలనీకి కింది భాగంలో సూర్యవంశీ కాలనీకి చెందిన పలు ఇండ్లు ఉన్నాయి. దాంతో బంజారా కాలనీ నుంచి వస్తున్న వరద నీరు ఆయా ఇండ్ల మధ్యలో నుంచి వెళ్తుంది. భారీ వరద వచ్చినప్పుడు ఇండ్లలోకి నీరు వస్తుందని పలువురు కాలనీ వాసులు తెలిపారు. ఇండ్ల మధ్యలో నుంచి భారీగా వరద ప్రవాహిస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.



ఆర్ఎస్ఆర్ కాలనీలోని ఇంట్లోకి చేరిన వరద

ఎగువ ప్రాంతాల వరద.. దిగువ ప్రాంతాల ముంపు

కుంట్లూర్ సాయినగర్ కాలనీ, సూర్యవంశీ కాలనీలోకి వరద

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద.. దిగువ ప్రాంతాల్లోని కాలనీలకు వచ్చి చేరుతుంది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో వస్తున్న భారీ వరదలతో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధి ఆర్ఎస్ఆర్ కాలనీలోని శ్రీ సాయినగర్ కాలనీలోకి హరిణావనస్థలి ఫారెస్ట్ నుంచి భారీగా వరద వస్తుంది. దీంతో లోతట్టులోని పలు ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో వారంతా ఇళ్లను కాళీచేసి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సాయినగర్ కాలనీలోని పలు ఇండ్లలో వరద నీరు నిల్వడంతో వారంత ఇళ్లను కాళీ చేసి వెళ్లిపోయారు. మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు కనీసం కాలనీ వైపునకు రాలేదని ముంపుకు గురైనా బాధితురాలు రేణుక తెలిపారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులు పూర్తి చేయకపోవడం వల్లే ముంపు

● ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే సబిత పర్యటన

సరూర్‌నగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులు పూర్తి చేయకపోవడం వల్లే ముంపు సమస్య తలెత్తుతోందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సదరు పనులను చేపట్టి పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షానికి జలమయమైన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వినాయకహిల్స్, నవారు యాదిరెడ్డి కాలనీ, స్వేచ్ఛానివాస్, సౌభాగ్యనగర్‌కాలనీ, నవయుగ కాలనీ, సీతాహోమ్స్, సాయిబాలాజీ టౌన్‌షిప్ తదితర కాలనీల్లో మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై నిలిచిన నీటితో పాటు డ్రైనేజీలు నిండి రోడ్లపైకి చేరిన మురుగు నీరు, ఇళ్లలోకి చేరిన వర్షం నీటిని పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్నేహమయినగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



స్నేహమయినగర్ కాలనీలో రోడ్లపై వరదనీరు

కాలనీలో నిలిచిన వరదనీరు

వనస్థలిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీలు జలదిగ్బంధం కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, అఖిలాండేశ్వరీనగర్, స్నేహమయినగర్, పీవీఆర్ కాలనీ, మహాలక్ష్మీ కాలనీ, గాయత్రీనగర్ తదితర కాలనీల్లో వరదనీరుతో పాటు డ్రైనేజీనీరు రోడ్లపై నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. పైకాలనీల నుంచి వస్తున్న వరదనీరుతో హరిహరపురం కాలనీలోని కాప్రాయి చెరువు పూర్తిగా నిండిపోయింది. గాయత్రీనగర్ కాలనీ, పాపిరెడ్డి కాలనీ, మహాలక్ష్మీకాలనీ, భవానీ ఎన్‌క్లేవ్ కాలనీల్లో వరదనీరు ఇళ్లమధ్యన ఉన్న ఖాళీ ప్లాట్లలో వరదనీరు చేరడంతో దుర్గంధంతో పాటు దోమల బెడద ఎక్కువైందని కాలనీవాసుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షపు నీటిని పంపింగ్ చేయించిన అధికారులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి చేరిన వర్షం నీటిని మునిసిపల్ అధికారులు మోటార్ల ద్వారా బయటకు పంపింగ్ చేయించారు. కమిషనర్ సరస్వతి, ఇతర అధికారులు ముంపు కాలనీల్లో పర్యటించి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో అప్పటికప్పుడు తగిన ఉపశమన చర్యలు చేపట్టారు. ఇళ్లలో వంట సామగ్రి పాడైన వారికి ఆహారం అందజేసినట్టు కమిషనర్ చెప్పారు. జయశంకర్ కాలనీలోని బాధితులను తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించినట్టు ఆమె తెలిపారు. వర్షం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబర్.8019823093కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ జాన్‌కృపాకర్, డీఈఈ వెంకన్న, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఏఈ హరీశ్, ఎస్సై యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వరదనీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపడుతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా వరుసగా కురిసిన భారీ వర్షానికి ముంపునకు గురైన బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని స్నేహమయినగర్, వినూత్న ఎన్‌క్లేవ్, గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, అఖిలాండేశ్వరీ నగర్, గాయిత్రీనగర్, మహాలక్ష్మీనగర్, హరిహరపురం తదితర కాలనీల్లో మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటించి, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్రంగూడ ఫారెస్ట్‌లోని రాగినికుంట నుంచి గాంధీనగర్, స్నేహమయినగర్, పీవీఆర్ కాలనీ, సామనగర్ మీదుగా కుమ్మరికుంట వరకు వరదకాలువ నిర్మాణం కోసం హరిహరపురం కాప్రాయి చెరువు నుంచి వివేకానంద విగ్రహం, శివసింధు చౌరస్తా, శివాలయం, గౌతమీనగర్, బతుకమ్మకుంట మీదుగా కుమ్మరికుంట వరకు వరదనీటి కాలువ నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డెరెక్టర్ అనిల్ చౌదరి, సందీప్ రెడ్డి, కాజ శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మాతా కీ చౌకీకి బీజేపీ అధ్యక్షుడికి ఆహ్వానం

సైదాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ శ్రీ విజయ వినాయక దేవాలయంలో ఈనెల 27న రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్న మాతా కీ చౌకీ పూజకు హాజరుకావాలని కోరుతూ హింధూ ధర్మ రక్ష ఫౌండర్, ఆలయ కమిటీ ఛైర్మన్ చీకోటి ప్రవీణ్ మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ పూజలకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజకీయ నేతలు హాజరుకానున్నారని తెలిపారు.

నిధులు మంజూరు చేయండి



జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అంజన్

ఎల్బీనగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్‌ను కార్పొరేటర్ శ్రీవాణి కలిసి వినతి పత్రం సమర్పించారు. బాపూనగర్, భగత్‌సింగ్‌నగర్, చెరుకుతోటకాలనీ, చౌడీలలో రోడ్ల రీకార్పెటింగ్, చౌడీ సర్కిల్ బ్యూటిఫికేషన్‌తో పాటు సరూర్‌నగర్ సీఎం రోడ్ విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఖాళీ స్థలాలలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో పాటు విజయపురికాలనీ నాలా పనులు కాంట్రాక్టర్ బిల్లుల సమస్యల కారణంగా నిలిచిపోయాయని వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్‌ను కార్పొరేటర్ కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

చంపాపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాలనీలలో చేపడుతున్న సీసీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి సూచించారు. చంపాపేట డివిజన్ లక్ష్మీ గణేశ్‌నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రేమ్‌జీ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఐఐఎంహెచ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం

సైదాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 10వ ఆయుర్వేద దినోత్సవ సందర్భంగా గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్) ఆధ్వర్యంలో మంగళవారం వాక్ ఫర్ ఆయుర్వేద పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు సంస్థ కార్యాలయం వద్ద కేంద్ర ఆయుర్వేద విజ్ఞాన పరిషత్ డిప్యూటీ డైరక్టర్ జనరల్ డాక్టర్ ఎన్.శ్రీకాంత్, డాక్టర్ పమ్మి సత్యనారాయణ శాస్త్రి, సంస్థ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ జేపీ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అయుర్వేద ప్రచారం, అవగాహన కోసం అయూష్ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నగరాలలో నిర్వహిస్తున్నదని తెలిపారు. ర్యాలీ అనంతరం ధన్వంతరి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థకు మాన్యుస్క్రిప్ట్‌లు, అరుదైన పుస్తకాలు, మ్యూజియం వస్తువులను విరాళంగా ఇచ్చిన ప్రముఖులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబోస్, శ్రీదేవి, సంతోష్ మానే. లైబ్రరీయన్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పాలన

● బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల తరుపున ప్రశ్నించే గొంతులను నొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నరని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టినందుకు అరెస్టు అయి బెయిల్‌పై విడుదలైన ఇంజాపూర్‌కు చెందిన బొక్క మురళీధర్‌రెడ్డిని మంగళవారం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామార్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల తరుపున స్థానిక ఎమ్మెల్యేను, ముఖ్యమంత్రిని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన ప్రభుత్వం కాదని.. ప్రజాస్వామ్యాన్ని కూని చేసే ప్రభుత్వం అని ఆరోపించారు. ఇలాంటి చర్యలు మానుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొక్క గౌతంరెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, గుర్రం చంద్రశేఖరెడ్డి, ఆనంద్‌రెడ్డి, కళ్యాణ్‌నాయక్, రొక్కం చంద్రశేఖర్‌రెడ్డి, కందాడి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, సంపతీశ్వర్‌రెడ్డి, మల్లేష్, ప్రభువర్ధన్‌రెడ్డి, మోహన్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగులను బదిలీ చేస్తే.. పదవికి రాజీనామా చేస్తా

● బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ పీఏసీ చైర్మన్ పెంటారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని బండ్లగూడ ఖల్సా రైతు సంఘంలో పని చేస్తున్న స్థానిక ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే వెంటనే తన పదవికి రాజీనామా చేస్తానని సంఘం పీఏసీ(పర్సన్ ఇన్‌చార్జి) చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి అన్నారు. బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ ఏర్పడి 50 సంవత్సరాలైన సందర్భంగా మంగళవారం బాలాపూర్‌లో నిర్వహించిన సంఘం సిల్వర్ జూబ్లీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బదిలీలను ఆపేయాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్త ఉద్యోగులకు ఇక్కడి పథకాలు, ఖాతాల గురించి అవగాహన లేనందున సభ్యులకు అసౌకర్యం తలెత్తే అవకాశం ఉన్నదని, ఈ దృష్ట్యా ఇక్కడి ఉద్యోగులను బదిలీ చేసే ఆలోచనను విరమించుకోవాలని ఆయన డీసీసీబీ అధికారులకు సూచించారు. బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీకి సంబంధించి సమావేశంలో చేసిన తీర్మానాన్ని తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సీఈవో ఎర్ర జైహింద్‌కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి రమాదేవి, పీఏసీ డైరెక్టర్లు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌సీ కన్వెన్షన్‌పై హైడ్రాకు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని సౌటకుంటలో నిర్మించిన వీఆర్‌సీ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ గంట అనుపమలక్ష్మారెడ్డి మంగళవారం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 184, 185 సౌటకుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని సుమారు 4 ఎకరాల్లో వీఆర్‌సీ కన్వెన్షన్, సర్వే నంబర్ 189, 191లో 4 ఎకరాల్లో గోదాంలను స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా సర్వే నంబర్‌లలో ప్రభుత్వ భూమితో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి ఉంటుందని పేర్కొన్నారు. కన్వెన్షన్‌తో పాటు గోదాంలకు మున్సిపల్, హెచ్ఎండీఏ నుంచి ఏలాంటి అనుమతులు లేవని తెలిపారు. అట్టి నిర్మాణాలపై వెంటనే విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ డిమాండ్ చేశారు. అదే విధంగా పెద్దఅంబర్‌పేట్ పరిధిలోని చెరువు, కుంట, కాలువల కబ్జాలపై దృష్టి పెట్టాలని కోరారు.

హైవేపై సీవర్ ట్రంక్ మెయిన్ మరమ్మతులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓల్డ్ బాంబే-విజయవాడ హైవే వద్ద ధ్వంసమైన 900 ఎంఎం డయా ఆర్‌సీసీ సీవర్ ట్రంక్ మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతుల పనులను వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. వాటర్‌బోర్డు చేపట్టే మరమ్మతులు, పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే.. రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం సీవర్ లైన్ సుమారు 20 అడుగుల లోతులో కుంగిపోవడంతో వెంటనే స్పందించిన వాటర్‌బోర్డు అధికారులు మరమ్మతు పనులు పనులను ప్రారంభించారు.

గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ హైవే క్రాసింగ్ వద్ద మురుగు సమస్యను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. వర్షపు నీరు సీవరేజ్‌లో కలిసిపోకుండా గ్యాప్ వర్క్ తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం నాగేందర్, జీఎంలు బలరామ రాజు, మహేందర్ నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీలకే కేటాయించాలి'

ఎల్బీనగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీలకు కేటాయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ యూనియన్ నేతలు సరూర్‌నగర్‌లోని సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న సచివాలయ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు కిషన్, నరసింహ, ఎల్లయ్య, సుకన్యకుమారి, గంగ, గౌరమ్మ, సత్యమ్మ, లత, సరస్వతి, నిర్మల పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలి

● మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా మన్సూరాబాద్ డివిజన్‌లో అనేక రోడ్లు తెగిపోయాయని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని అధికారులకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. ఇటీవల కురిసిన వర్షం కారణంగా ఎదురైన ఇబ్బందులను తెలుకునేందుకు మంగళవారం సాయంత్రం మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహరెడ్డి హయత్‌నగర్‌లోని లక్ష్మీభవానీ కాలనీ, పవనగిరి కాలనీ, లక్ష్మీనగర్, బృందావన్‌కాలనీలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, సత్యం, సాయిలు గౌడ్, కోదండ సురేస్, రజనీకాంత్, నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

● కాంగ్రెస్ నాయకులు పార్వతి గణేష్ రెడ్డి



అఖిలాండేశ్వరీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న గణేష్ రెడ్డి, రామారావు

వనస్థలిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీలలో వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆ పార్టీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ నాయకులు పార్వతి గణేష్ రెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని వరద ముంపునకు గురైన శివారు కాలనీల్లో మంగళవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామరావు, కాంగ్రెస్ నాయకులు గణేష్ రెడ్డి పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదనీటి సమస్య పరిష్కారానికి టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దివ్యారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థిని మృతి

హయత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి దాటుతున్న విద్యార్థినిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన విద్యార్థినిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్ము అండ్ కశ్మీర్‌కు చెందిన ఖుర్షీద్ హమ్మద్ వాణి కొన్ని సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో కలిసి హయత్‌నగర్‌లోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన కూతురు యమున(20) సంగారెడ్డిలోని గీతం కళాశాలలో సైకాలజీ మొదటి సంవత్సరం చదువుతోంది. కళాశాల బస్సు ఎక్కడానికి మంగళవారం ఉదయం రోడ్డు దాటి కిష్టవేణి ఆస్పత్రి వైపు వస్తుండగా విజయవాడ వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయిందని పోలీసులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి చైన్ స్నాచింగ్

● పోలీసుల అదుపులో నిందితురాలు

మన్సురాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తుతెలియని మహిళా అపహరించిన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ ఆనంద్‌నగర్ రోడ్డు నం.4లో దూళిపాళ ధనలక్ష్మి(65) ఒంటరిగా నివాసముంటుంది. మంగళవారం ఉదయం ధనలక్ష్మి వంటచేస్తుండగా గుర్తుతెలియని మహిళ మొకానికి వస్త్రం కట్టుకుని ఇంట్లోకి వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న తులం బంగారు గొలుసును లాక్కొని, వృద్ధురాలి నోటికి ప్లాస్టర్ వేసి అక్కడ నుంచి పరారైయింది. వృద్ధురాలు బయటకు వచ్చి స్థానికులకు విషయం చెప్పింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు. పతుల్లాగూడకు చెందిన స్రవంతి నిందితురాలిగా గుర్తించిన పోలీస్‌లు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డం శ్యామలకు కీర్తి పురస్కారం

కొత్తపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూనాగోల్ వాసి గజల్ రచయిత్రి విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ డా.గడ్డం శ్యామలకు డా.తిరుమల శ్రీనివాసచార్య- స్వరాజ్యలక్ష్మి కీర్తి పురస్కారం అందుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం 2024 కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఎన్‌టీఆర్ కళా మందిరంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు చతులమీదుగా డా.శ్యామల ఈ పురస్కారం అందుకున్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ టీం మేనేజర్‌గా స్వాములు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు తెలంగాణ టీం మేనేజర్‌గా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం జడ్పీహెచ్ఎస్ పీఈటీ సోలపోగుల స్వాములు ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం దాసరి ప్రతాప్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న 36వ జాతీయ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ టీం తరపున మేనేజర్‌గా స్వాములు వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు. అథ్లెటిక్స్ పోటీలకు టీం మేనేజర్‌గా ఎంపిక కావడం పట్ల స్కూల్ హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు



గాయత్రీదేవి అలంకరణలో ఉన్న శ్రీ ప్రత్యంగిరా అమ్మవారిని దర్శించుకున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ దంపతులు



ధర్మరక్షణ చారిటబుల్ ట్రస్ట్ మండపం వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, అఖిల దంపతులు



హస్తినాపురం డివిజన్‌లోని శ్రీ హరిహరక్షేత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో దేవి నవరాత్రులలో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపకులు వంగా మధుసూధన్‌రెడ్డి తదితరులు



వనస్థలిపురం రైతుబజార్ పార్కులో అమ్మవారి పూజలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సతీష్ కుమార్ గౌడ్ తదితరులు



మలక్‌పేటలో దుర్గామాత మండపలంలో భక్తులు



కొత్తపేట న్యూ మారుతీనగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



ప్రత్యంగిరా అష్టమాతృక సహిత కాలభైరవ ఉపాసకులు ప్రసాద్ గురుస్వామిని సత్కరిస్తున్న నాగోల్ మహాకాళి ఆలయ కమిటీ సభ్యులు



మాతామైదాన్ విజయదుర్గమాతను దర్శించుకున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ